క్లుప్తంగా

డిప్యూటీ సీటీఎం సందర్శన



ఆత్మకూరురూరల్: నెల్లూరు జోనల్ ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం రమేష్ ఆత్మకూరు ఆర్టీసీ డిపోను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, గ్యారేజీ కార్మికులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శివకేశ్ యాదవ్, డిప్యూటీ మేనేజరు రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదురుపల్లిలో కంటి వైద్య శిబిరం



సోమశిల: చేజర్ల మండల పరిధిలోని ఆదురుపల్లి గ్రామంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్మార్ట్ విజన్ కంటి వైద్యశాల, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని వెంకటేశ్వర ప్రాథమిక చికిత్స కేంద్రంలో శిబిరం నిర్వహించారు. పీఎంపీ సభ్యులు పి.కృష్ణయ్య, కేవై బాబు మాట్లాడుతూ ఈ శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించగా, 30 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. కార్యక్రమంలో స్మార్ట్ విజన్ హాస్పిటల్ మేనేజర్ రాంబాబు, టెక్నీషియన్ సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా ఊరేగింపు



కొండాపురం: మండలంలోని సత్యవోలు గ్రామ పంట పొలాల్లో నాగారపమ్మ కొలుపు సందర్భంగా బుధవారం అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. గ్రామస్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడు పంచాయతీ అశ్వనీపురానికి చెందిన సయ్యద్ లతీఫ్ అనే యువకుడు ఏసీ రిపేర్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మరణించారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం శ్రీనివాసులురెడ్డి బుధవారం తక్షణ ఆర్థిక సాయంగా రూ.5 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మర్రిపాడు: కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ పి.పేతున స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీధి దీపాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి బైపాస్ నుంచి వెళ్లే మార్గంలో వీధి లైట్లు లేనందున రాత్రి వేళల్లో సిబ్బంది, రోగులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల సాక్షిలో వెలువడిన కథనానికి దాత గువ్వల కృష్ణారెడ్డి స్పందించారు. ఆయన బుధవారం 15 స్తంభాలకు సొంత నిధులు వెచ్చించి వీధిదీపాలను ఏర్పాటు చేశారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబం తమ భూముల ఆక్రమణపై స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. ఎన్నో ఏళ్ల క్రితం ప్రభుత్వం సర్వే నంబర్ 341, 342లలో ముత్యాల మనోహర్, మహేష్, బండి రమణయ్యలకు భూమి కేటాయించింది. అయితే తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ వ్యక్తి ఆక్రమించుకున్నారని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సంగంలో మోస్తరు వర్షం

సంగం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సంగం మండలంలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.

యువ కబడ్డీ రెఫరీగా మహేష్ ఎంపిక

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరికి చెందిన గోసాల మహేష్‌బాబు(బాబీ) యువ ఆంధ్ర కబడ్డీ సీజన్–1 రెఫరీగా ఎంపికైనట్లు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచి శ్రీకాంత్ బుధవారం ప్రకటించారు. ఈ క్రమంలో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

చెరువులిలా... సాగేలా?

కూటమి నేతల స్వార్థం.. మండల రైతులకు శాపంగా మారింది. యథేచ్ఛగా చెరువు మట్టిని కొల్లగొడుతుండడంతో పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా వందల ఎకరాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

- మట్టి కోసం చెరువులను కొల్లగొడుతున్న కూటమి నేతలు
- ఆందోళనలో అన్నదాతలు



ఆరడుగుల మేర తవ్విన గుంతలు



హసనాపురం చెరువు గుంతల్లో చేరిన నీరు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలంలోని దాదాపు 32 గ్రామాల్లో 33 చెరువులు ఉన్నాయి. అయితే కూటమి నేతలు ఈ చెరువుల నుంచి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించుకుని లబ్ధి పొందుతున్నారు. అదే క్రమంలో కొన్ని చెరువుల్లో విపరీతంగా మట్టిని తవ్వి రూ.లక్షలు దండుకుంటున్నారు. మండలంలోని హసనాపురం చెరువు నుంచి ఇప్పటికే మట్టి తోలుకుని చెరువును పనికి రాని స్థితికి చేర్చారు. రానున్న వర్షాకాలంలో చెరువుకు నీరు వచ్చినా రైతులకు ఉపయోగపడే పరిస్థితి లేదు. ఆ చెరువు కింద దాదాపు 100 ఎకరాల మాగాణి భూములు ఉన్నాయి. దీని కిందనే రైతులు పంటలు పండించుకుంటారు. అయితే ఇటీవల ఈ చెరువులో కొంత మంది కూటమి నేతలు మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదేకాక పక్కనున్న తెల్లపాడు, అబ్బీపురం, కొండ మీద కొండూరు, రాజవోలు లాంటి పెద్ద చెరువుల్లో మట్టిని అమ్ముకుని కూటమి నేతలు లబ్ధిపొందుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు అలుగుకు ఆరు అడుగుల కింద భాగంలో నీరు నిల్వ ఉండడం వల్ల అలుగు పారే అవకాశాలు లేవు. దీంతో సాగు నీరు కిందకు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామ కొలనుల అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని పలు చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. అప్పటి రాష్ట్ర మంత్రి, దివంగత నేత మేకపాటి గౌతమ్‌రెడ్డి ఎన్నో నిధులను సమకూర్చారు. హసనాపురం గ్రామంలోని చెరువును గ్రామ కొలనుగా అభివృద్ధి చేసేందుకు దాదాపు రూ.86 లక్షల నిధులను విడుదల చేయించారు. అయితే ఆయన మరణానంతరం చెరువు అభివృద్ధి పనులు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లక్షల మెట్రిక్ టన్నుల మట్టిని ఆత్మకూరు, సంగం ప్రాంతాల్లోని లేఅవుట్లతో పాటు, పెట్రోల్ బంకులు, ప్రైవేట్ లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు. దీంతో ఆరు అడుగుల మేర గుంతలు ఏర్పడ్డాయి. ఈ చెరువు కింద దాదాపు వంద ఎకరాలతో పాటు కిందనున్న శ్రీకొలను చెరువుకు సైతం నీటిని తరలిస్తుంటారు. శ్రీకొలను చెరువు కింద దాదాపు 500 ఎకరాలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం హసనాపురం చెరువులో నీరు చేరితే గుంతలకే పరిమితం అవుతుంది. ఆ చెరువు నిండితే కానీ కిందనున్న శ్రీకొలను చెరువుకు నీటిని తరలించడం కష్టంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ చెరువుల కింద వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారుతోంది. గతంలో ఉన్న నీటి పారుదల శాఖ ఇంజినీర్లు లంచాలకు అలవాటు పడి రేయింబవళ్లు మట్టిని తోలించారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ఇలాంటి క్రమంలో చెరువులను అభివృద్ధి చేయాల్సిన కూటమి నేతలే మట్టిని తరలిస్తే అభివృద్ధి ఎలా అంటూ స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి చెరువుల్లో మట్టి తరలింపును అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



ఆత్మకూరురూరల్: విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్ అన్నారు. మండలంలోని అశ్వనీపురం, కరటంపాడు, మహిమలూరు గ్రామాల్లో ఉన్న మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలకు సకాలంలో హాజరు కావాలని తెలియజేశారు. ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉందని, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించినప్పుడే విద్యార్థుల హాజరు పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు



ఆత్మకూరురూరల్: మండలంలోని నాగులపాడులో అంకాల పరమేశ్వరి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు గణపతి పూజ, దీక్షాబంధనం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. గ్రామానికి చెందిన సోమవరపు సురేంద్రరెడ్డి– జ్యోతి, సోమవరపు సుమంత్‌రెడ్డి– ప్రవల్లిక దంపతులు కార్యక్రమాలు నిర్వహించారు.

విధుల్లో అలసత్వం తగదు

- డీఎంహెచ్‌ఓ సుజాత



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఆత్మకూరు: వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ నిర్వాహకులు, ఆశా కార్యకర్తలు తమ విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని, అలసత్వం తగదని జిల్లా వైద్యశాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ సుజాత అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నేషనల్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులను 12 వారాల్లోపు గుర్తించి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేసేలా డాక్టర్ బాధ్యత వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను తరచూ కలిసి పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ యూపీహెచ్‌సీ డాక్టర్ అస్మా, ఎంపీహెచ్ఈఓ సుధాకర్, డీఈఐసీ రమణ, ఏఎన్ఎం రాఘవ రాణి, ఆశా కార్యకర్తలు షాహీనా, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు కిట్ల పంపిణీ



ఆత్మకూరు: పట్టణంలోని వెస్ట్ పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు అవసరమైన కిట్లను ఎంఈఓ అనంతలక్ష్మి బుధవారం అందజేశారు. అలింకో, ఎస్ఎస్ఎస్‌ఏ వారి ఆధ్వర్యంలో వీటిని అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఈ కిట్‌లు ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ కె.పద్మ, ఆళ్ల జయకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ఉదయగిరి: అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



ఆత్మకూరు: జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు కళాశాల నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు హర్ ఘర్ తిరంగాపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి భారత జాతీయ ఔన్నత్యాన్ని పెంపొందించాలన్నారు. ఈనెల 15 వరకు ర్యాలీ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఇంద్రసేనారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, కోఆర్డినేటర్ విక్రమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

- ఆత్మకూరు: పట్టణంలోని టిడ్కో కాలనీవాసులు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ప్రజలు కలిసి జాతీయ జెండాలతో మెయిన్ రోడ్డు వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జ్యోతి మయూరి, పెంచలయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతుల రద్దుకు వినతి



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరికుంటపాడు: వరికుంటపాడు పంచాయతీ పరిధిలో మైనింగ్ అనుమతులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని గ్రామ పంచాయతీ మేధావుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (డీఏఓ) భార్గవికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనింగ్ కారణంగా స్థానిక పర్యావరణానికి, భూగర్భ జలాలకు, వ్యవసాయ భూములకు, ప్రజారోగ్యానికి కలిగే నష్టాలను వివరించారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న సాధన సమితి నాయకులు

ఉదయగిరి రూరల్: నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో వెనుకబడిన మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లా ఏర్పాటు చేయాలని మంత్రుల ఉపసంఘాన్ని కోరినట్లు ఉదయగిరి జిల్లా సాధన కమిటీ బుధవారం తెలిపింది. వెలగపూడి సచివాలయంలో జరిగిన మంత్రుల ఉపసంఘం సమావేశంలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు పాల్గొని, తమ వాదన వినిపించారు. రాష్ట్రంలోనే ఉదయగిరి నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందని, ఇది ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని కలిసిన వారిలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు షేక్.దస్తగిరి అహ్మద్, జి.రామిరెడ్డి, రబ్బాని ఉన్నారు.

సొసైటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: ఉదయగిరి మండలం కొట్టాలపల్లి సొసైటీ చైర్మన్‌గా గడ్డం వెంకటసోమయ్య, డైరెక్టర్లుగా బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, సహకార బ్యాంకు మేనేజర్ రాజశేఖర్, సీఈఓలు పోలయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

- వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ప్రాథమిక పరపతి సంఘ చైర్మన్‌గా చల్లా వెంకటేశ్వర్లు, డైరెక్టర్లుగా కోదూరు నాగిరెడ్డి, గని శ్రీనివాసులునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈఓ మేకల రమణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం.. అపహాస్యం

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ఉదయగిరి: కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం.. అపహాస్యమైందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందన్నారు. టీడీపీ గూండాలు పోలింగ్ కేంద్రంలో దౌర్జన్యానికి పాల్పడి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు నెట్టేశారన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటేసేందుకు వచ్చిన ఓటర్లను అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఈ ఎన్నిక కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

వ్యక్తిగత భద్రతపై శ్రద్ధ అవసరం



ఆత్మకూరు : విద్యార్థినులకు సూచనలు చేస్తున్న సీఐ గంగాధర్



సీతారామపురం: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ షాను

ఆత్మకూరు: పాఠశాల, కళాశాల విద్యార్థినులు తమ వ్యక్తిగత భద్రతపై శ్రద్ధ వహించాలని ఆత్మకూరు సీఐ ఎం.గంగాధర్ సూచించారు. సైబర్ నేరాలు, ర్యాగింగ్, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్‌ఫోన్లను కేవలం విద్యాభివృద్ధికి మాత్రమే ఉపయోగించుకోవాలని, ఇతర వ్యాపకాల కు పోరాదన్నారు. ఇదేక్రమంలో కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

- సీతారామపురం: విద్యార్థులు మంచి మార్గంలో నడిచినప్పుడే ప్రగతి సాధించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్.షాను అన్నారు. స్థానిక కోటవీధిలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆమె బుధవారం పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం రామకృష్ణమరాజు, ఉపాధ్యాయులు రవిచంద్ర, ముజీబా తబస్సుమ్, గోసుల వెంకటేశ్వర్లు, ఖాజా రహమతుల్లా, అంగన్‌వాడీ కార్యకర్తలు మహబూబ్ జానీ, స్రవంతి పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



సీతారామపురం: వివాహ వేడుకలో రాజగోపాల్‌రెడ్డి



దగదర్తి: వధూవరులతో రామిరెడ్డి

సీతారామపురం: ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చింతంరెడ్డి పద్మావతి, సుబ్బారెడ్డిల కుమారుడు లోకేష్‌రెడ్డి వివాహ వేడుక కావలిలోని కేవీఆర్ కన్వెన్షన్ హాల్లో బుధవారం జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరై నూతన వధూవరులకు ఆశీర్వచనం అందించారు.

- కావలి (జలదంకి): నియోజకవర్గంలో బుధవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. బోగోలు మండలం నాగులవరంలో వైఎస్సార్‌సీపీ నేత బి.విజయ్‌బాబు కుమార్తె వివాహ వేడుకల్లో రామిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కావలి పాతూరుకు చెందిన చీమకుర్తి మధురెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన గోళ్ల శ్రీహరి కుమారుడు పృథ్వీరాజ్ కుమారుని నలుగు వేడుకలో పాల్గొన్నారు.
- దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల గ్రామానికి చెందిన గునిశెట్టి సుబ్బారావు కుమారుడు శ్రీకాంత్–అనూషల వివాహ వేడుక ఇటీవల జరిగింది. ఈ క్రమంలో వారి ఇంటికి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం వెళ్లి ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఇండ్ల వెంకటసుబ్బయ్య, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, షేక్.రఫీ, గునిశెట్టి రమేష్, వెంకటరమణ, సురేష్, కుడుముల వెంకటరమణయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.
- కలిగిరి: కృష్ణారెడ్డిపాళెం పంచాయతీలోని చంద్రారెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ నేత కరువది కృష్ణారెడ్డి కుమారుని వివాహ వేడుకలకు ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం రాత్రి హాజరయ్యారు. వధూవరులు నవీన్‌కుమార్‌రెడ్డి–స్వర్ణారెడ్డిలను ఆశీర్వదించారు.


స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉదయగిరి: ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో పలువురు కార్మికులు బుధవారం పంచాయతీ బస్టాండ్ సమీపంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాటిని ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఇటీవల ఉదయగిరి ప్రాంతంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా



ఉదయగిరి రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు రెండో రోజు బుధవారం ఉదయగిరి ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ మాజీ డిపో కార్యదర్శి ఎస్వీ మౌలాలి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా ఆర్టీసీ సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కాగా ఈ ధర్నాకు ఏపీఎన్జీఓ నాయకుడు షేక్.రియాజ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సలాం, కాశీ విశ్వనాథ్, మూర్తి, సీనారెడ్డి, ఫణికుమార్, విజయకుమార్, ముజాఫర్, జయశంకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

కారు అదుపుతప్పి మహిళకు గాయాలు



మర్రిపాడు: కారు అదుపుతప్పి మహిళకు గాయాలైన ఘటన మండలంలోని పొంగూరు గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద బుధవారం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి అనంతసాగరం మండలం గౌరవరంలో తమ బంధువుల పెళ్లి శుభకార్యానికి వెళ్తూ మార్గమధ్యలో పొంగూరు సమీపంలో కారు అదుపుతప్పి కంప పొదల్లో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడిపే మహిళతో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.


మినీ వ్యాన్ బోల్తా

దగదర్తి: మండలంలోని సున్నపుబట్టి సమీపంలో జాతీయ రహదారిపై బుచ్చిరెడ్డిపాళెం నుంచి కావలికి వెళ్తున్న మినీ వ్యాన్ బుధవారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మోహన్, కోటయ్య, లక్ష్మమ్మలకు స్వల్ప గాయాలు కాగా దగదర్తి పోలీసులు క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

కళ్లల్లో కారంకొట్టి బంగారం అపహరణ

కొండాపురం: పత్తి తీసేందుకు పొలంలోకి వెళ్లిన వృద్ధురాలి కళ్లల్లో గుర్తుతెలియని దుండగుడు కారం కొట్టి రెండు సావర్ల బంగారు సరుడును అపహరించిన ఘటన మండలంలోని చల్లావారిపల్లెలో బుధవారం చోటుచేసుకుంది. కొండాపురం ఎస్సై జి.మాల్యాద్రి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యారావ లక్ష్మమ్మ అనే వృద్ధురాలు తన పొలంలో పత్తి తీసేందుకు వెళ్లింది. పత్తి తీస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె కళ్లల్లో కారం చల్లి మెడలో ఉన్న సరుడును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ బోల్తా



మర్రిపాడు: మండల పరిధిలోని నెల్లూరు– వైఎస్సార్ కడప అంతర జిల్లా సరిహద్దు ప్రాంత సమీపంలో కోళ్ల లోడుతో వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.